క్లుప్తంగా

1 నుంచి ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

వీపనగండ్ల: దీపావళి పండుగ, గంగమ్మ జాతరను పురస్కరించుకొని మండల కేంద్రంలో నవంబర్ 1 నుంచి ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నామని, ఈ పోటీలో ఉత్సాహవంతులు పాల్గొనాలని నిర్వాహకులు క్రాంతికుమార్, శివయాదవ్, మహేష్ విజ్ఞప్తి చేశారు. పోటీలో పాల్గొని ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు ముంత మల్లయ్య యాదవ్, యువ నాయకులు శివయాదవ్ సహకారంతో మొదటి బహుమతిగా రూ.15 వేలు, రెండో బహుమతిగా రూ.10 వేల నగదు, మూడో బహుమతిగా రూ.5 వేలు అందజేయనున్నట్లు వారు తెలిపారు. క్రీడల్లో పాల్గొనాలనుకునే వారు 63004 76059, 63040 39959 ఫోన్ నంబర్లను సంప్రదించాలని వారు కోరారు.

మాలల హక్కులు పరిరక్షించాలి



వీపనగండ్ల: మాలలు ఎదుర్కుంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఆదివారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మాల కమ్యూనిటీ నాయకులు నాగర్‌కర్నూల్ పట్టణంలో నిర్వహిస్తున్న మాలల ఆత్మగౌరవ సమావేశానికి తరలివెళ్లారు. గతంలో రాజ్యాంగం కల్పించిన హక్కులను యథావిధిగా కొనసాగించాలని మాజీ సర్పంచ్ రామేశ్వర్‌రావు, మాజీ ఉపసర్పంచ్ నరేష్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాగముని, భరత్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం



అమరచింత: కాంగ్రెస్ కార్యకర్తల కుటుంబాలను ఆదుకునేందుకు ఎల్లప్పుడూ ముందుంటామని డీసీసీ ప్రధాన కార్యదర్శి అయూబ్‌ఖాన్ అన్నారు. పట్టణానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త అనారోగ్యానికి బాధపడుతూ వైద్య ఖర్చుల కోసం సీఎం రిలీఫ్‌ఫండ్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. మంజూరయిన సీఎంఆర్ఎఫ్ చెక్కును స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సూచన మేరకు ఆదివారం లబ్ధిదారుడికి అందించారు. ఈసందర్భంగా అయూబ్‌ఖాన్ మాట్లాడుతూ పార్టీని నమ్ముకొని ఎల్లవేళలా కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటులో భాగస్వాములైన ప్రతి కార్యకర్తను ఆదుకునేందుకు ఎమ్మెల్యే ముందున్నారని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రతి గడపకు అందిస్తామన్నారు. మహేందర్ రెడ్డి, పోసిరిగారి విష్ణు, హనుమంతునాయక్, ప్రభుదాస్, ఆషు పాల్గొన్నారు.

జాతరకు భక్తుల రద్దీ

పెద్దకొత్తపల్లి: నాయనోనిపల్లి మైసమ్మ జాతరకు ఆదివారం భక్తులు పోటెత్తారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి మైసమ్మ దేవతకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. టికెట్ల ద్వార రూ.40825లు, హుండీ ద్వార రూ.77 వేలు ఆదాయం సమకూరిందని ఎండోమెంట్ ఈఓ రామేశ్వరశర్మ, మైసమ్మ దేవత ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు.

తప్పని నీటి కష్టాలు

- మరమ్మతుకు నోచుకోని బోరుమోటారు
- ఇబ్బందుల్లో కార్యాలయాల సిబ్బంది



భోజనం ప్లేట్లు, చేతులు కడిగేందుకు ఇతర ప్రాంతాల నుంచి నీటిని తీసుకొస్తున్న ఏఓ కార్యాలయం సిబ్బంది (ఫైల్)



మరమ్మతుకు నోచుకోని బోరు మోటారు

పాన్‌గల్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఏఓ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాలకు నీటిని సరఫరా చేసే బోరు మోటారు చెడిపోయి మూడు నెలలు కావస్తున్నా నేటికీ మరమ్మతుకు నోచుకోకపోవట్లేదు. ఆయా కార్యాలయాల్లో నీటి సరఫరా లేక మూత్రశాలలు, మరుగుదొడ్లు మూతపడటంతో ఆయా కార్యాలయాల మహిళా ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర సమయంలో సమీపంలోని ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతోపాటు పీహెచ్‌సీకి వచ్చే గర్భిణులు, బాలింతలు, ఇతర రోగులకు ఇబ్బందులు తప్పడంలేదు. బోరు మోటార్ మరమ్మతు చేసేందుకు ఆయా కార్యాలయాల అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు. ఎవరు ముందుకు వారిపైనే మరమ్మతుకు సంబంధించిన ఖర్చులు పడతాయని ఎవరూ స్పందించడం లేదని అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బోరు మోటారుకు మరమ్మతులు చేపట్టి నీటి ఇబ్బందులను తొలగించాలని ఆయా కార్యాలయాల సిబ్బంది కోరుతున్నారు.

అన్నదాత కోసం హరీశ్‌రావు రైతు రణం బాట

- కేసీఆర్ హయాంలో వ్యవసాయం పండుగ
- కాంగ్రెస్ హయాంలో రైతు హరిగోస
- బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్



మాట్లాడుతున్న వాకిటి శ్రీధర్

వనపర్తి రూరల్: అన్నదాత కోసం మాజీ మంత్రి హరీష్‌రావు రైతు రణం బాట చేస్తున్నారని బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ అన్నారు. ఆదివారం మండలంలోని పెద్దగూడెంలో డబుల్ బెడ్‌రూం, కడుకుంట్ల, మెంటెపల్లి, దత్తాయిపల్లి, దత్తాయిపల్లితండా, చందాపూర్, గుంతతండా, మన్యతండా, అంకూర్, వెంకటాపురం గ్రామాల్లో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో వనపర్తిలో ఈనెల 29న నిర్వహించే రైతాంగ ప్రజా నిరసన సదస్సు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీల అమల్లో పూర్తిగా విఫలమైందన్నారు. రైతు రుణ మాఫీ, రైతు భరోసా, నిరుద్యోగ భృతి, కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం వంటి పథకాల అమలును విస్మరించిందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు చేస్తున్న మోసాన్ని ఎండగట్టేందుకు నిర్వహిస్తున్న రైతాంగ ప్రజా నిరసన సభకు ప్రతి గ్రామం నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మాణిక్యం, సింగిల్ విండో అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, ధర్మానాయక్, మాధవ్‌రెడ్డి, నరేష్, కొండన్న, చిట్యాల రాము తదితరులు పాల్గొన్నారు.

పంటల రక్షణకు రైతన్నల అవస్థలు



తూంకుంటలో వేరుశనగ పంటకు రక్షణగా చుట్టిన చీరలు

వీపనగండ్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో పంటలను సాగు చేసిన రైతులు అడవిపందుల బెడద నుంచి తమ పంటలను కాపాడుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. మండలంలో గోపల్‌దిన్నె రిజర్వాయర్ కట్టకు అనుసరించి ఏపుగా కంపతార చెట్లు పెరగడంతో అక్కడే అడవి పందులు ఆవాసాలు ఏర్పాటు చేసుకొని పంటలను నాశనం చేస్తున్నాయి. ఊరచెరువు, పల్లెచెరువు, సంగినేనిపల్లి పెద్ద చెరువు సమీపంలో వరి, వేరుశనగ పంటలు సాగు చేసిన రైతులు చీరలను రక్షణగా చుట్టి పంటలను కాపాడుకుంటున్నారు. ప్రభుత్వం స్పందించి 50 శాతం సబ్సిడీతో కంచెను అందజేయాలని మండలంలోని రైతులు కోరుతున్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం



సభ్యత్వాలు అందజేస్తున్న బీజేపీ నాయకులు

ఖిల్లాఘనపురం: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సీతారాములు అన్నారు. ఆదివారం మండలంలోని సల్కెలాపురం, అప్పారెడ్డిపల్లి గ్రామాల్లో మండల అధ్యక్షుడు బుచ్చిబాబుగౌడ్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మండల నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగి సభ్యత్వ నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రధానమంత్రి నరేంద్రమోడీ చేపడుతున్న సంక్షేమ పథకాలు పేదలకు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. ఆయన పాలనలో దేశం సుభిక్షంగా ఉంటుందని నమ్మిన ప్రజలు బీజేపీ సభ్యత్వం తీసుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కేశవులు, రాములు పాల్గొన్నారు

కాంగ్రెస్ మండల అధ్యక్షుడికి పరామర్శ



మదనాపురం: కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గజ్జల నాగన్న అనారోగ్యంతో బాధపడుతూ మహబూబ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆదివారం కాంగ్రెస్ నాయకులు అక్కల మహాదేవన్‌గౌడ్, వడ్డె కృష్ణ, మార్కెట్ వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, విజయ్, పార్టీ నాయకులు ఆయనను పరామర్శించారు. అనంతరం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు. పార్టీ పరంగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

రోడ్లపై మురుగుతో ఇబ్బందులు



రోడ్లపై పారుతున్న మురుగు

పాన్‌గల్: మండలంలోని మాందాపూర్‌లో సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు రోడ్లపై ప్రవహిస్తుండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు గ్రామస్తులు వాపోతున్నారు. పలు కాలనీల్లో సీసీ రోడ్లు ఉన్నా డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో రోడ్లపైనే మురుగు ప్రవహిస్తుండటం, దీనికి తోడు గ్రామ సమీపంలోని పంట పొలాల నుంచి ఊట నీరు కూడా గ్రామంలోకి వస్తుండటంతో ఏ కాలనీలో చూసిన రోడ్లన్నీ బురదమయంగా మారాయి. దీంతో దుర్వాసన, దోమల వృద్ధితో ఇబ్బందులు తప్పడంలేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సరైన డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేసి రోడ్లపై మురుగు ప్రవహించకుండా తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వాయిద్య పరికరాలు అందజేత



వాయిద్య పరికరాలు అందజేస్తున్న నర్సింహ

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లికి చెందిన కొంకలి నర్సింహ ఆలయానికి రూ.38వేలు విలువ చేసే వాయిద్యానికి సంబంధించిన బ్యాండ్, కీబోర్, మైక్ తదితర పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ వాయిద్య పరికరాలను వాయించడంపై గ్రామ యువతకు శిక్షణ ఇప్పించాలనే ఉద్దేశంతో మరో రూ.30వేలు చెల్లించి శిక్షకులు వర్ధన్, సంతోష్, రాజేష్‌ను నియమించినట్లు తెలిపారు. గ్రామంలో ఆసక్తిగల వారు శిక్షణను సద్వినియోగం చేసుకొని వాయిద్య పరికరాలను నేర్చుకోవాలని సూచించారు. గ్రామంలో ముందు సంప్రదాయ పద్ధతిలో వాయిద్య పరికరాలను వాయిస్తూ పండగలు, ఉత్సవాలు నిర్వహించాలని, అందులో భాగంగానే వాయిద్య పరికరాలు అందించానని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు నర్సింహను అభినందించారు.

'కార్యకర్తల అభిమానానికి రుణపడి ఉంటా'



అమరచింతలో కేక్ కట్‌చేస్తున్న సీతాదయాకర్‌రెడ్డి

అమరచింత: తమపై కార్యకర్తలు చూపుతున్న అభిమానానికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే, ఉమ్మడి జిల్లా మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ కొత్తకోట సీతా దయాకర్‌రెడ్డి అన్నారు. సీతా దయాకర్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని అమరచింత పట్టణంలో ఆదివారం నిర్వహించిన వేడుకల్లో ఆమె పాల్గొని కేక్ కట్ చేశారు. ఈసందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి టీడీపీని వీడి కాంగ్రెస్‌లో చేరి తమకు వెన్నంటి ఉంటూ ఆదరిస్తున్న ప్రతి ఒక్కరిని ఆదుకునేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పాసిరిగారి తిరుమలేష్, బుచ్చిరెడ్డి, పెద్దబాలరాజు, దేవరాజు, నందిమళ్ల రాజు, చంద్రశేఖర్‌రెడ్డి, బాలరాజ్, చంద్రగౌడ్ రవీందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మాసన్న తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలపై అభిప్రాయాల సేకరణ

కొల్లాపూర్: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో ఆర్ఐడీ పాఠశాల, కళాశాల పూర్వ విద్యార్థులు ఆదివారం సమావేశం అయ్యారు. నవంబర్ 27వ తేదీ నుంచి 29వ తేదీ వరకు నిర్వహించే సమ్మేళనం కార్యక్రమంపై పూర్వ విద్యార్థులు అభిప్రాయాలను సేకరించారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు తమవంతు సలహాలు ఇచ్చారు. పూర్వ విద్యార్థులు తప్పనిసరిగా కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

30 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- ముస్తాబైన పాగుంట వేంకటేశ్వరస్వామి ఆలయం
- జాతర ప్రాంగణంలో వెలిసిన దుకాణాలు



లక్ష్మీవేంకటేశ్వరస్వామి మూల విరాట్



జాతర ప్రాంగణంలో వెలసిన ఆట వస్తువులు, జాయింట్ వీల్



ముస్తాబవుతున్న రథాలు

కేటీదొడ్డి: కోరిన కోర్కెలు తీరుస్తూ, భక్తుల కొంగు బంగారంగా వెలుగొందుతున్న వెంకటాపురం పాగుంట లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ఆలయం ముస్తాబైంది. బుధవారం స్వామివారి కల్యాణోత్సవంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ పెద్దలు తెలిపారు. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. జాతర ప్రాంగణంలో మిఠాయి దుకాణాలు, రంగుల రాట్నాలు, జాయింట్ వీల్స్, వివిధ దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా రోడ్లు, విద్యుత్ సౌకర్యం తాగునీటి సదుపాయాలు కల్పించేందుకు ఆలయ కమిటీ సిబ్బంది చర్యలు చేపడుతున్నారు.

ప్రత్యేక బస్సులు..

వేంకటేశ్వరస్వామి జాతరకు గద్వాల ఆర్టీసీ అధికారులు ప్రత్యేక ఆర్టీసీ బస్సులను నడుపుతారు. జిల్లా కేంద్రం నుంచి దాదాపు 30 కిలో మీటర్ల దూరంలో ఆలయం ఉంది. గద్వాల నుంచి రాయచూర్ మార్గంలోని కొండాపురం స్టేజీ కొండాపురం గ్రామం మీదుగా వెంకటాపురం చేరుకోవచ్చు

కార్యక్రమాలు ఇలా..

ఈనెల 30 నుంచి వచ్చే నెల 3 వరకు స్వామి వారి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో తరలివస్తారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. రథోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం పూజ కార్యక్రమం శుక్రవారం 10:30 స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. అదే రోజు సాయంత్రం 6 గంటలకు ప్రభోత్సవం శనివారం సాయంత్రం 6 గంటలకు రథోత్సవం నిర్వహించనున్నట్లు, కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు స్వామి వారి పల్లకీ సేవ నిర్వహిస్తామని పేర్కొన్నారు.

పెబ్బేరు పట్టణ పరిధిలోని సర్వే నంబర్లు 392 & 405 లోని భూమికి సంబంధించిన బహిరంగ హెచ్చరిక

ఇందుమూలముగా సమస్త ప్రజలకు మా క్లయింట్స్ అయిన శ్రీ ఎస్. వెంకటేశ్వర్లు తండ్రి సీతారాములు, శ్రీ ఎస్. రమేష్ బాబు తండ్రి సీతారాములు, శ్రీ ఎస్. రమేష్ బాబు తండ్రి కృష్ణయ్య గార్ల తరఫున తెలియపరుచునది ఏమనగా, మా క్లయింట్స్ వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణ పరిధిలోని సర్వే నంబర్లు 392 మరియు 405ల లోని భూమికి సర్వ హక్కుదారులు. ఇట్టి భూమి మా క్లయింట్స్ యొక్క తాత గారైన శ్రీ నంబి రామ లక్ష్మయ్య గారికి ఇనాంగా వచ్చి ఆయన జీవిత కాలంలో ఇట్టి భూమిని సంపూర్ణంగా అనుభవించినాడు. అతని తదనంతరం 1975లో లాండ్ రిఫామ్స్ ట్రిబ్యునల్ / కోర్టు ఫైల్ నం. C.C. No. 593/Wpt/75 and C.C. No. 591/Wpt/75 ద్వారా సర్వే నంబర్ 392 మరియు 405లలో గల భూములు శ్రీ నంబిరామలక్ష్మయ్య గారి కుమారులైన నంబి కృష్ణయ్య మరియు నంబి సీతారాముల గార్ల భూములుగా గుర్తిస్తూ తేది: 28/06/1976 నాడు ఉత్తర్వులు జారీ చేసారు. ఇట్టి ఉత్తర్వులపై ఎవరికైనా ఎలాంటి అభ్యంతరాలు ఉన్నట్లయితే వారు Sec 20 ఆఫ్ ల్యాండ్ రిఫామ్స్ చట్టం ప్రకారం 30 రోజులలోగా అప్పీల్ వేసి అట్టి ఉత్తర్వులను అప్పీల్ ద్వారా చాలెంజ్ చేసి ఉండాలి. కానీ ఇట్టి భూములు సంపూర్ణంగా మా క్లయింట్స్‌కి చెందినటువంటివి కావున ఇట్టి భూముల పై గవర్నమెంట్ / ప్రైవేటు వ్యక్తులు/గుడి/ దేవాదాయ శాఖ గాని ఎలాంటి అప్పీల్ గానీ, రివిజన్ గానీ వేయలేదు. ఐదు దశాబ్దాల తరువాత ఇట్టి ఉత్తర్వులను రద్దు చేసే అధికారం సివిల్ కోర్టు / ఉన్నత న్యాయ స్థానం / సర్వోన్నత న్యాయస్థానాలకు కూడా లేదు. అందువలన ల్యాండ్ రిఫార్మ్స్ ట్రిబ్యునల్/ కోర్ట్ తేది 28-06-1976 నాడు C.C. No. 593/Wpt/75 and C.C. No. 591/Wpt/75 ఫైల్స్ ద్వారా ఇచ్చిన ఉత్తర్వులు అంతిమం.

అంతేగాక పెబ్బేరుకు పిజెపి కెనాల్ వచ్చినపుడే 392 సర్వే నెంబర్ గల భూమిలో 2 గుంటల భూమిని ప్రభుత్వం సేకరించినపుడు నష్టపరిహారాన్ని వేణుగోపాల స్వామి గుడికి (ఎండోమెంట్)కి ఇవ్వాలా లేదా నంబి కృష్ణయ్య గారికి ఇవ్వాలా అనే వివాదం తలెత్తినది. అందుకు గాను భూసేకరణ అధికారి గారు ఈ కేసును సివిల్ కోర్టుకు Sec30 భూసేకరణ చట్టం కింద పరిష్కారానికై పంపడం జరిగింది. ఇట్టి కేసు గౌరవ సీనియర్ సివిల్ జడ్జి వనపర్తి కోర్ట్ నందు O.P.NO.33/2002 గా నమోదుకాబడి సమగ్రంగా విచారణ చేయబడిన తరువాత, గౌరవ సీనియర్ సివిల్ జడ్జ్ వనపర్తి కోర్ట్ వారు అట్టి నష్టపరిహార డబ్బును శ్రీ నంబి కృష్ణయ్య గారికే ఇవ్వాలని తేది 11.03. 2003 నాడు తీర్పు ఇచ్చినారు. ఆ తీర్పు ప్రకారమే శ్రీ నంబి కృష్ణయ్య గారే నష్ట పరిహారం డబ్బులు తీసుకున్నారు. ఇట్టి ఉత్తర్వులపై ఎవరికైనా ఎలాంటి అభ్యంతరాలు ఉన్నట్లయితే వారు భూసేకరణ చట్టం ప్రకారం అప్పీల్ /రివిజన్ వేసి అట్టి ఉత్తరువులను చాలెంజ్ చేసిఉండాలి. కానీ, ఇట్టి భూములు సంపూర్ణంగా మా క్లయింట్స్‌కి చెందినటువంటివి కావున ఇట్టి భూముల పై గవర్నమెంట్ /ప్రైవేటు వ్యక్తులు/ గుడి / దేవాదయ శాఖ గాని ఎలాంటి అప్పీల్ గానీ, రివిజన్ గానీ వేయలేదు. దశాబ్దాల తరువాత ఇట్టి ఉత్తర్వులను రద్దు చేసే అధికారం ఎవరికి లేదు. అందువలన గౌరవ సీనియర్ సివిల్ జడ్జ్ వనపర్తి కోర్ట్ వారు తేది.11.03.2003 నాడు O.P.NO.33/2002 లో ఇచ్చిన తీర్పు అంతిమం మరియు శిరోధార్యము.

ఇట్టి భూమి పై నంబి కృష్ణయ్య, కీ॥ శే॥ నంబి సీతారాములు గారి కుమారులు అయిన శ్రీ వెంకటేశ్వర్లు, శ్రీ రమేష్ బాబులు ఇనామ్ రద్దు చట్టం ప్రకారం దరఖాస్తు చేసుకొనగా ఫైల్ నెంబర్ B/1633/2005 లో అప్పటి వనపర్తి RDO (ఇనాం ట్రిబ్యునల్ / కోర్ట్) గారి వద్ద విచారణ జరిగినది. ఇట్టి సర్వే నంబర్లు 392 & 405 భూమి అన్నీ రెవెన్యూ రికార్డ్‌లలో ' మాఫీ ఇనాం ' గా మరియు 'నంబి రామలక్ష్మయ్య' గారు ఇనాం దారుగా నమోదు కాబడినది. రెవెన్యూ రికార్డులలో నంబి రామలక్ష్మయ్య గారి పేరును పూజారి నంబి రామలక్ష్మయ్య అని రాయడం జరిగింది. నిజానికి ఆనాటి కాలంలో వృత్తిని ముందు పేర్కొంటూ పేర్లు రాయడం ఆనాటి పట్వారాలకు అలవాటుగా ఉండేది. దీన్ని ఆసరాగా తీసుకోని ఇట్టి కేసులో వేణుగోపాల స్వామి గుడి/ఎండోమెంట్ వారు స్వార్థ రాజకీయ శక్తుల ప్రేరేపణతో సర్వే నెంబరు 392 లో గల ఎ.15-18 గుంటల భూమికి మాత్రమే ORC క్లెయిమ్ చేయడం జరిగింది మరియు సర్వే నెంబరు 405 కు సంబంధించి ఎలాంటి క్లెయిమ్ చేయలేదు. ఇట్టి కేసులో అప్పటి వనపర్తి గౌరవ RDO (ఇనాం ట్రిబ్యునల్ /కోర్టు) గారు పై పేర్కొన్న ల్యాండ్ రిఫార్మ్ ట్రిబ్యునల్ /కోర్ట్, సీనియర్ సివిల్ జడ్జ్ వనపర్తి కోర్ట్ వారి ఉత్తర్వులు, సేత్వారు ఇతర ప్రామాణిక రెవెన్యూ రికార్డ్‌లను పరిగణలోనికి తీసుకుని చట్ట పరిధిలో తేది 28.03.2007 నాడు ఫైల్ నెంబర్ B/1633/2005 ద్వారా మా క్లయింట్స్‌కు సర్వే నెంబరు 392లో గల ఎ.15-18 గుంటలు & సర్వే నంబరు 405లో గల ఎ. 15-01 గుంటలు భూమికి ORC ఇవ్వడం జరిగింది. తదుపరి పెబ్బేరు MRO గారు ఇట్టి ORC ని అమలు చేస్తూ మా క్లయింట్స్ కు పట్టాదార్ పాసుబుక్స్, టైటిల్ డీడ్స్ ఇవ్వడం జరిగింది. తదనంతరం గుడి/ఎండోమెంట్ వారు 2007 లో కేవలం 392 సర్వే నెంబరు మీద మాత్రమే ఆ భూమి తమకు చెందినదిగా అప్పీల్ చేసుకున్నారు. అట్టి అప్పీల్‌ను కూలంకషంగా పరిశీలించిన ఇనాం అప్పీలేట్ ట్రిబ్యునల్ చివరకు 2019 లో ఇట్టి అప్పీల్‌ను కొట్టివేస్తూ ఇంతకముందు అనగా 2007 లో మా క్లైంట్స్‌కు ఇచ్చిన ORC సరైనదే అని తీర్పు ఇచ్చింది. ఇట్టి భూమిపై మా క్లైంట్స్ సర్వ హక్కులు కలిగి ప్రభుత్వ రైతు బంధు పొందుతున్నారు. ఇట్టి విలువైన భూమిని 2023 లో భూ సేకరణ చట్టం ప్రకారం కొనుగోలు చేయుటకు మునిసిపాలిటీ/ప్రభుత్వం వద్ద డబ్బు లేనందువల్ల ఆ నాటి జిల్లా కలెక్టర్ మరియు ఇతర పెద్దల హామీ వల్ల పెబ్బేరు పట్టణానికి నిస్వార్థంగా విద్యా మరియు వైద్య సేవలు అందించిన స్వర్గీయ నంబి కృష్ణయ్య గారు మరియు మా క్లైంట్స్ పెద్ద మనస్సుతో తమ విలువైన (గుంట 25,000/-) ఎ.12-28 గుంటల భూమిని ప్రభుత్వ పరంగా రిజిస్టర్ చేయడం జరిగింది. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రత్యామ్నాయ భూమిని ఇవ్వలేక పోయినందువల్ల గౌరవ హైకోర్టు వారు సమగ్రంగా విచారించి మా క్లైంట్స్ చేసిన గిఫ్ట్ డీడ్‌లను రద్దు చేయడం జరిగింది. ఆ తరువాత కూడా రాజకీయ నేతల ఒత్తిళ్లకు లొంగి మా క్లైంట్స్ లకు సంబంధించిన భూమిలో అక్రమంగా సంత నడపడానికి ప్రభుత్వం ప్రయత్నం చేయడంతో మా క్లైంట్స్ రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ ముఖ్య కార్యదర్శి, వనపర్తి. జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్లు, RDO వనపర్తి, పెబ్బేరు తహసిల్దార్, పెబ్బేరు మునిసిపల్ కమిషనర్ మరియు గౌరవ MLA శ్రీ తూడి మేఘారెడ్డి (వనపర్తి నియోజక వర్గ శాసనసభ్యులు) గార్ల పై W.P. నెం. 27691 ఆఫ్ 2024 ద్వారా గౌరవ హైకోర్టులో రిట్ దాఖలు చేసి ఉండిరి. ఈ రిట్ పై జరిగిన విచారణలో చట్టాల గురించి, వాస్తవ పరిస్థితుల గురించి అవగాహన ఉన్న ఉన్నత అధికారులు ప్రభుత్వం తరఫున వారు ఈ సంత స్థల విషయంలో తమకెవరికి ఎలాంటి హక్కులు లేవని, పట్టాదారుల పొజిషన్‌కు ఆటంకాలు కలిగించబోమని, తామేవరమూ ఈ భూమి విషయంలో కలుగజేసుకోమని లిఖితపూర్వకంగా హైకోర్టుకు తెలియజేశారు. అందువల్ల ఈ లిఖితపూర్వక హామీని హైకోర్టు పరిగణనలోకి తీసుకొని తేది. 04.10.2024 నాడు అప్పీల్ చేయుటకు కూడా వీలులేని అంతిమ తీర్పు వెలువరించింది. కానీ ఇప్పటికి స్వార్థ రాజకీయ శక్తులు మా క్లైంట్స్‌కు సంబంధించిన భూమిని గౌరవ హైకోర్ట్ తీర్పులకు కూడా వక్రీకరిస్తూ మా క్లైంట్స్‌కు సంబంధించిన భూమిని గుడి/దేవాదాయ భూమిగా తప్పుడు ప్రచారం చేస్తూ వివాదాలు సృష్టిస్తున్నారు. ఒకవేళ బయట ప్రచారంలో ఉన్నట్లు అది ఎండోమెంట్ భూమే అయితే, ఎండోమెంట్ రిజిస్టర్‌లో అట్టి భూమి నమోదు అయి ఉండాలి. అలా నమోదు కాని భూమి గురించి అది ముమ్మాటికీ ఎండోమెంట్ (దేవస్థానం) భూమి అని మాట్లాడటం కోర్టు ధిక్కరణ కిందకు వస్తుంది అని తెలియజేస్తున్నాము. అసలు పెబ్బేరులోనే ఎండోమెంట్ పేరు మీద భూమే లేదు అని చాలా స్పష్టంగా ఎండోమెంట్ రిజిస్టర్ 43 చూసిన ఎవరికైనా అర్థం అవుతుంది, ఆ ఎండోమెంట్ రిజిస్టర్ అన్ని ప్రభుత్వ మండల మరియు రిజిస్ట్రేషన్ ఆఫీసుల్లో అందుబాటులో ఉంది. ఒకవేళ నమోదు అయి ఉంటే కూడా, ఎండోమెంట్ యాక్ట్‌లోని సెక్షన్ 75-80 ప్రకారం అట్టి భూమిని కౌలు/అమ్మకం/దానం/అన్యాక్రాంతం చేసే వీలు లేదు. ఇట్టి చట్టాలపై సరి అయిన అవగాహన లేకుండానే మా క్లైంట్స్‌కు సంబంధించిన భూమి పై కోర్ట్ తీర్పులను వక్రీకరిస్తూ కోర్ట్ ధిక్కారణ ప్రకటనలు చేయుచున్నారు. ప్రస్తుతం ఇట్టి భూమిలో మా మొదటి క్లైంట్ తన అవసరాల నిమిత్తం ఎ.1-06 గుంటల భూమిని ఇతరులకు అమ్మడం జరిగింది. ప్రస్తుతం మా క్లైంట్స్‌కు సర్వే నెంబరు 392లో గల ఎ.15-16 గుంటలు మరియు సర్వే నెంబరు 405 లో గల ఎ.13-35 గుంటల భూమి పై సర్వ హక్కులు కలిగి వారి యొక్క అవసరాల కొరకు శ్రీ ఎస్. నీలం గౌడ్ తండ్రి నారాయణ గౌడ్ R/o తాటిపాముల గ్రామం గారికి అగ్రిమెంట్ ఆఫ్ సేల్ ద్వారా భూ విక్రయ ఒప్పందం చేసుకోవడం జరిగింది. కావున ఇట్టి సర్వహక్కులు కలిగిన మా క్లైంట్స్‌కు సంబంధించిన వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణ పరిధిలోని సర్వే నెంబర్లు 392 మరియు 405 లలోని భూమిపై ఎవరైనా తప్పుడు ప్రకటనలు చేసిన మరియు వారి భూమిలో ఎవరైనా ఎటువంటి కార్యకలాపాలు నిర్వహించిన వారి పై మా క్లైంట్స్ చట్టరీత్యా చర్యలు తీసుకోనగలరని హెచ్చరించనైనది.

పి. శ్రీరాం రావు, పి.మన్మోహన్ రావు, డి.అశోక రావు, పి.వనజా దేవి, టి.శిరిష్ చంద్ర ప్రసాద్, ఎస్. రమేష్, పి.రఘు వంశీ, ఎ. భరత్ కుమార్ మరియు ఎం. రాహుల్, న్యాయవాదులు, వనపర్తి.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

ఎస్.రాజేందర్ గౌడ్, ACM - 9618066349
వనపర్తి | ఎ. గణేష్ కుమార్ | - 91605 62261
కొత్తకోట / పెబ్బేర్ | ఐ. రాజశేఖర్ గౌడ్ | - 97000 09392
టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు :

యాడ్స్ మేనేజర్ 9951602829
జబ్బర్ లాల్ : 9553955603